క్లుప్తంగా

అంగన్‌వాడీలపై అవగాహన ర్యాలీ



పామర్రు: అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందాలని ఐసీడీఎస్ పామర్రు సెక్టార్ సూపర్‌వైజర్ వాణి అన్నారు. స్థానిక కొబ్బరితోట, ఎన్టీఆర్ కాలనీల్లో ఆదివారం ×అంగన్‌వాడీ పిలుస్తోంది¤ అవగాహన కార్యక్రమం, అనంతరం చిన్నారులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడు ఏళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు. ఐదేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల నుంచి ప్రాథమిక పాఠశాలలో చేర్పించడం జరుగుతుందని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్‌లో ఆటలతో కూడిన చదువు, పౌష్టికాహారం అందింజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, చిన్నారులు, తల్లులు పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తికి రక్తదానం



గుడివాడ టౌన్: గాయపడిన వ్యక్తికి రక్తదానం చేసి ఆర్‌కే వారియర్స్ సభ్యులు ప్రాణాలు కాపాడారు. ఆదివారం నాగవరప్పాడుకు చెందిన షేక్ మస్తాన్ ప్రమాదానికి గురై గాయాల పాలై రక్తం కోల్పోవడంతో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి రక్తదాతలకు సమాచారం అందజేశారు. దీంతో స్పందించిన వారియర్స్ గ్రూప్ సభ్యులు మెండా గంగాధరరావు, కిరణ్ స్పందించి రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌కే వారియర్స్ వ్యవస్థాపకుడు రామకృష్ణ, కార్యకర్తలు నూనె అయ్యప్ప, చరణ్‌తేజ్, ఆర్‌కే వారియర్స్ సభ్యులు పాల్గొన్నారు.

ఎంఈవోగా నరేష్‌కుమార్




ముదినేపల్లి రూరల్: ముదినేపల్లి ఎంఈవోగా కె.నరేష్‌కుమార్ నియమితులయ్యారు. ఉమ్మడి జిల్లాలో ఆదివారం జరిగిన ఎంఈవో–2 కౌన్సెలింగ్‌లో నరేష్‌కుమార్ ముదినేపల్లి మండలాన్ని ఎంపిక చేసుకున్నారు. ఈయన గతంలో ఇదే మండలంలో ఎంఈవోగా పని చేస్తూ కలిదిండి మండలానికి బదిలీపై వెళ్లారు. ప్రస్తుత ఇన్‌చార్జ్ ఎంఈవోగా కైకలూరు ఎంఈవో డి.రామారావు కొనసాగుతుండగా ఆయన స్థానంలో నరేష్‌కుమార్ నియమితులయ్యారు. మండలంలోని ఉపాధ్యాయ సంఘాల నేతలు పలువురు నరేష్‌కుమార్‌కు అభినందనలు తెలిపారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం



ముదినేపల్లి రూరల్: మండలంలోని పెదపాలపర్రులో అగ్నిప్రమాద బాధితులకు వైఎస్సార్ సీపీ నాయకులు ఆదివారం ఆర్థిక సాయం అందించారు. గ్రామానికి చెందిన మండపల్లి పెద్దిరాజు ఇల్లు ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో పూర్తిగా కాలిపోయింది. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, పార్టీ సీనియర్ నాయకుడు ఈడే వెంకటేశ్వరరావు, పెద్దిరాజు కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాధిత కుటుంబానికి పార్టీ అండగా నిలుస్తుందని, కొత్త ఇంటిని నిర్మించుకునేందుకు ప్రభుత్వం తరపున రుణం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు శీలం రామకృష్ణ, నాయకులు చల్లగుళ్ల శ్రీకాంత్, గంటా కోటేశ్వరరావు, పరమానందరావు, రాచూరికుమార్,దివిసతీష్,పేర్ని పృథ్వీ పాల్గొన్నారు.

కోలాహలంగా పోతురాజు జాతర



రేమాలవారిపాలెం(నాగాయలంక): పేర్లవాని లంక గ్రామంలో పోతురాజు స్వామి దేవస్థానం వార్షిక జాతర మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. పోతురాజు స్వామి శిలలకు నాగాయలంక శ్రీరామ పాద క్షేత్రం పుష్కరఘాట్ వద్ద కృష్ణానదిలో శుద్ధి పూజలు జరిపారు. అనంతరం గ్రామానికి తరలించి ఆచారవంతుల పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నైవేద్యాల కావళ్లతో భక్తులు తరలివచ్చి మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం పోతురాజు శిలలకు గ్రామోత్సవం నిర్వహించారు. పెద్దలు పేర్ల గోవిందరామయ్య, పేర్ల భీమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విత్తన చట్టం..అవగాహన అవసరం

- లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే విత్తనాలు కొనాలి
- విత్తనాలు కొంటే రశీదు తప్పనిసరిగా తీసుకోవాలి
- విత్తనాల కొనుగోళ్లలో అప్రమత్తత అవసరం



విత్తన దుకాణం

పామర్రు: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. కొన్ని చోట్ల పనులు ముమ్మరమవుతున్నాయి. రైతులు అందరూ విత్తనాలను సేకరించే పనుల్లో నిమగ్నమవుతున్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో మొత్తం 90 వేల ఎకరాల్లో మాగాణి వరి సాగు, మరికొన్నిచోట్ల మెట్ట సాగు చేస్తున్నారు. ప్రస్తుతం సాగులో దుక్కులు దున్నే పనులు పూర్తి చేస్తున్నారు. నారుమళ్లు పోసేందుకు రైతులు సన్నాహాలు చేస్తున్నారు. కొందరు రైతులు తాము తయారు చేసుకున్న విత్తనాలు సిద్ధం చేస్తుండగా అధికశాతం మంది రైతులు దుకాణాల్లో విత్తనాలు చేసేందుకు సంసిద్ధులవుతున్నారు. సాగులో విత్తన ఎంపిక అత్యంత కీలకమైనది. వీరికి విత్తనాలపై అవగాహన కలిగించేందుకు వ్యవసాయశాఖ అధికారులు విత్తనాల సేకరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నారు.

అవగాహన ఉండాలి..

ప్రస్తుతం ప్రైవేటు దుకాణాల్లో విత్తనాలు విక్రయాలు జోరందుకున్నాయి. క్రయవిక్రయాలు అధికంగా జరిగితే ఈ సీజన్‌లో రైతులు మోసపోయే అవకాశాలు కూడా ఎక్కువే. విత్తన చట్టంపై అవగాహన పెంచుకుంటే ఇలాంటి అవస్థలు ఉండవని వ్యవసాయశాఖ నిపుణులు సూచిస్తున్నారు. ఈ చట్టం ద్వారా విత్తనాలు కొనుగోలు చేసే రైతుకు ఎలాంటి అన్యాయం జరిగినా సంబంధిత విత్తనాల డీలర్లపై కఠినమైన చర్యలుతీసుకుంటారు.

విత్తన చట్టం ఇదీ..

విత్తన చట్టం 1966, విత్తన నిబంధనలు 1968, విత్తన నియంత్రణ ఉత్తర్వులు 1983 తదితర చట్టాలు పొందు పరిచి విత్తన పరమైన అతిక్రమణలు, ఉల్లంఘనలు వర్తించే విధంగా ఈచట్టాన్ని రూపొందించారు. విత్తన విక్రయాల్లో మోసాలకు పాల్పడిన వారిపై విత్తన నియంత్రణ ఉత్తర్వులు–1983 క్లాజు 3 ప్రకారం ఆయా దుకాణాల్లో విత్తనాలను జప్తు చేయడంతో పాటు అత్యవసర సరుకుల చట్టం 1955 సెక్షన్ ఏ ప్రకారం జరిమానా కూడా విధిస్తారు. జిల్లాలో సుమారు 417 ప్రైవేట్ డీలర్లు దుకాణాలుఉన్నాయి. 121 మంది విత్తనాల విక్రయాల డీలర్లు, 165 మంది ఎరువుల విక్రయాల డీలర్లు, 131 మంది పురుగుమందుల విక్రయాల డీలర్లు ఉన్నారు.

స్టాక్ బోర్డు ఏర్పాటు చేయాలి..

విత్తనాలు విక్రయించే దుకాణాల్లో కచ్చితంగా ధరలు, స్టాకు బోర్డులను ఏర్పాటు చేయాలి. అలా లేకుంటే విత్తన నియంత్రణ ఉత్తర్వుల–1989 క్లాజు 8 ప్రకారం ఆయా దుకాణాల్లో విత్తనాల అమ్మకాల నిలుపుదల చేస్తారు. అధికారులు ఇచ్చిన నోటీసులకు సరైన సమాధానం ఇవ్వకపోతే లైసెన్సు సస్పెండ్, రద్దు చేస్తారు.

లేబుల్ లేక పోతే..

ప్రైవేట్ విత్తనాల అమ్మకం దారుడి వద్ద కొనుగోలు చేసిన విత్తనాల బస్తాలకు లేబుల్ లేక పోతే విత్తన చట్టం–1966 సెక్షన్ 7 ప్రకారం చర్యలు చేపట్టవచ్చు. ఆయా విత్తనాలను జప్తు చేసే అధికారం ఉంది. అత్యవసర సరుకుల చట్టం–1955 సెక్షన్ ప్రకారం జరిమానా విధిస్తారు.

కాలం చెల్లిన విత్తనాలు అమ్మితే..

విత్తన చట్టం–1966 సెక్షన్ 7 ప్రకారం విత్తన నియంత్రణ ఉత్తర్వులు–1983 క్లాజు 8ను అనుసరిస్తూ డీలర్ లైసెన్సు సస్పెండ్, రద్దు చేయవచ్చు.

రశీదు ఇవ్వాల్సిందే..

విత్తనాలు కొనుగోలు చేసే రైతులకు ఆయా దుకాణదారుడు కచ్చితంగా రశీదు ఇవ్వాలి. రశీదు ఇవ్వని పక్షంలో విత్తన నియంత్రణ ఉత్తర్వులు–1983 క్లాజు 9 ప్రకారం ఆయా దుకాణదారుడికి ముందుగా నోటీసు జారీ చేసి దానికి సరైన సమాధానం ఇవ్వకపోతే ఆయా డీలర్ లైసెన్సను సస్పెండ్, రద్దు చేయవచ్చు.

లైసెన్సు ప్రదర్శన తప్పని సరి..

ప్రైవేట్ విత్తనాల విక్రయ దుకాణాల్లో తప్పనిసరిగా విత్తన లైసెన్సును ప్రదర్శించాలి. లేకుంటే ఆ దుకాణంలో విత్తనాల విక్రయాలను నిలిపివేయవచ్చు. అంతే కాక నోటీసు ఇస్తూ దానికి సరైన సమాధానం ఇవ్వక పోతే విత్తన నియంత్రణ త్తర్వులు–1983 క్లాజు 5 ప్రకారం డీలర్ లైసెన్సు సస్పెండ్, రద్దు చేయవచ్చు.

నిబంధనలు పాటించాల్సిందే..



ప్రభుత్వం పొందు పరచిన విత్తన చట్టానికి అనుగుణంగా ప్రైవేట్ విత్తనాల డీలర్లు విత్తనాలను విక్రయించాలి. ఈ విషయంలో ఆయా డీలర్లు నిబంధనలు అతిక్రమిస్తే భారీగా జరిమానాతో పాటు దుకాణాల లైసెన్సును పోగొట్టుకునే పరిస్థితి ఉంటుంది.

–స్వర్ణలత, ఏడీఏ, పామర్రు

ఇంటింటికీ కుళాయి కనెక్షన్‌కు ఏర్పాట్లు

- వలివర్తిపాడులో గ్రామానికి చేరిన సామగ్రి
- రూ.58 లక్షల నిధులు మంజూరు



పంచాయతీ కార్యాలయానికి చేరిన సామగ్రి వద్ద ఏఈ పృథ్వి, నాయకులు

గుడివాడరూరల్: మండలంలోని వలివర్తిపాడు గ్రామంలో గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) చొరవతో ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చేందుకు రూ.58 లక్షల నిధులు మంజూరయ్యాయి. గ్రామంలో కొంతకాలంగా నిరుపేదలకు సొంత కుళాయి కనెక్షన్ లేకపోవడంతో నీటి కొరకు పబ్లిక్ కుళాయిలపై ఆధారపడి ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను గ్రామంలోని వైఎస్సార్ సీపీ నాయకులు ఎమ్మెల్యే కొడాలి నాని దృష్టికి తీసుకువెళ్లారు. తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే నాని గ్రామంలో ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేసేందుకు జల్‌జీవన్‌మిషన్ నిధులు రూ.58 లక్షలు మంజూరు చేయించారు. ఈ పనుల్లో భాగంగా ఆదివారం కుళాయి ఏర్పాటుకు అవసరమైన పైపులు, ట్యాప్‌లు, ఇతర సామగ్రి గ్రామానికి చేరుకుంది. గ్రామ పెద్దల సమక్షంలో అధికారులు సామగ్రిని స్వాధీనం చేసుకుని భద్రపర్చారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి డీఈ అట్లూరి వెంకటేశ్వరరావు సమక్షంలో సామగ్రిని అధికారులు స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద ఉంచారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ ఎమ్మెల్యే కొడాలి నాని చొరవతో గ్రామంలో శాశ్వత తాగునీటి సమస్యకు పరిష్కారం లభించిందన్నారు. గ్రామంలో ప్రతి ఇంటికీ కుళాయి ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు నీటి కష్టాలు ఇక ఉండవన్నారు. గ్రామంలో సామగ్రిని భద్రపర్చామని, మరో పది రోజుల్లో పనులు ప్రారంభించి యుద్ధప్రాతిపాదికన పూర్తి చేస్తామన్నారు. గ్రామంలో శాశ్వత నీటి సమస్య పరిష్కారానికి చొరవ చూపిన ఎమ్మెల్యే నానికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హౌసింగ్ ఏఈ పృథ్వీ, వైఎస్సార్ సీపీ నాయకులు శాయిన నాగబాబు, కండవల్లి రవికుమార్ పాల్గొన్నారు.

శాంతియుత సమాజానికి భక్తిభావం అవసరం

సమరసత సేవా ఫౌండేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి త్రినాథ్



మాట్లాడుతున్న ఎస్ఎస్ఎఫ్ నేత పాకాల త్రినాథ్

పామర్రు: సమాజం శాంతియతంగా, సుభిక్షంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని సమరసత సేవా ఫౌండేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాకాల త్రినాథ్ అన్నారు. దేశ సంస్కృతికి సంప్రదాయాలకు, నాగరికతకు పట్టుకొమ్మల వంటి హిందు దేవాలయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలోని సమరసత మండల కన్వీనర్లకు ఆదివారం స్థానిక అంకమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో హిందూ ధర్మ పరిరక్షణపై ఒక్కరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా త్రినాథ్ మాట్లాడుతూ మన దేవాలయాలు ఒకప్పుడు వైద్యాలయాలు, సాంస్కృతిక ధార్మిక కేంద్రాలుగా విలసిల్లాయని అన్నారు. ప్రజలలో ఆధ్యాత్మిక భావనను పెంపొందించేందుకు సమరసత సేవాసంస్థ సభ్యులు నిరంతరం కృషి చేయాలని అన్నారు. మత మార్పిడిలు లేకుండా ఉండేలా బడుగు బలహీన వర్గాల కాలనీల్లో హిందూ దేవాలయాల నిర్మాణాలను చేపడుతున్నామని అన్నారు. ప్రతి కాలనీలో హిందు దేవాలయాల ఏర్పాటుకు తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. కృష్ణా జిల్లా సమరసత ధర్మప్రచారక్ ఆళ్ల జయశంకర్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో సమరసత సేవ ఫౌండేషన్ జిల్లా మహిళా విభాగం కన్వీనర్ దేవరగట్ల నాగరాజ కుమారి, ఆర్ఎస్ఎస్ విభాగ్ ప్రచారక్ నవీన్, సమరసత జిల్లా ప్రముఖ్‌లు పీఎంఎస్ ప్రసాద్, అరిగల బాలుడు, పొనుగుమాటి లక్ష్మణరావు, ఆళ్ల రామిరెడ్డి, వంకా భవాని పాల్గొన్నారు.

యోగాతో వ్యాధులు దూరం

కృష్ణా జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ బాలాజీ



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న యోగా సాధకులు

మచిలీపట్నంటౌన్: యోగాతో వ్యాధులు దూరమవుతాయని, ప్రతి ఒక్కరూ యోగా, నడకను సాధన చేయాలని కృష్ణా జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ తోట బాలాజీ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ యోగా సభ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కరోనా వంటి క్లిష్ట సమయాల్లో సైతం యోగా సాధకులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నారన్నారు. యోగా ఉపయోగాలను వివరించారు. అర్బన్ బ్యాంక్ మాజీ అధ్యక్షుడు బొర్రా విఠల్ మాట్లాడుతూ నేటి తల్లిదండ్రులు పిల్లలను ఏసీ గదులకు పరిమితం చేయడం వల్ల చిన్న వయస్సులోనే గుండె పోటుకు గురవుతున్నారని చెప్పారు. ప్రతి ఒక్కరూ కష్టపడే విధానాన్ని పెంచుకోవాలని, యోగాను దైనందిన జీవితంలో భాగస్వామ్యం చేసుకోవాలని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ యోగా సభ అధ్యక్షుడు పల్లపోతు కృష్ణ మాట్లాడుతూ యోగాతో మన ఆరోగ్యం మన చేతుల్లో ఉంటుందన్నారు. యోగా గురువులు ఘంటసాల గురునాథబాబు యోగా ప్రాధాన్యతను తెలిపారు. యోగా గురువు మద్దాల చింతయ్య, ముదిగొండ శాస్త్రి, లంకిశెట్టి బాలాజీ, తమ్మన సూర్యనారాయణ, పలువురు యోగా సాధకులు పాల్గొన్నారు.

టెన్త్ టాపర్లకు సన్మానం

అవనిగడ్డ: నియోజకవర్గ స్థాయిలో పదో తరగతిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను చైల్డ్ హుడ్ గ్రూప్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఆదివారం స్థానిక సంస్థ కార్యాలయంలో నియోజకవర్గ ప్రథమ స్థానం సాధించిన ఆకుల ప్రేమ్ సాయి, ద్వితీయ స్థానంలో నిలిచిన బావిశెట్టి కావ్య, తృతీయ స్థానంలో నిలిచిన మేడికొండ మోనాలను సన్మానించి నగదు బహుమతులు అందజేశారు. గ్రూప్ సభ్యులు యాసం శోభన్‌బాబు, అలపర్తి గోపాలకృష్ణ, సామల్లి మల్లికార్జునరావు, బండే శ్రీను, డాక్టర్ కృష్ణమోహన్, అన్నపరెడ్డి కృష్ణ, అన్నపరెడ్డి పిచ్చియ్య, హనుమంతు శ్రీనివాస్, చన్నగిరి రాము, పర్చూరు మురళి, బండ్రెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేత ఉప్పాలకు ఎమ్మెల్యే నివాళి



నడుపూరులో ఉప్పాల పార్థివదేహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు ఉప్పాల రాంప్రసాద్ శనివారం పెడన మండలం నడుపూరు స్వగృహంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఆయన కుమారులు వినయ్, శ్యామ్‌లు ఆదివారం పరామర్శించారు. ఉప్పాల కుమారుడు రామును ఓదార్చారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఎమ్మెల్సీ జయయంగళ వెంకటరమణ ఉప్పాల మృతికి సంతాపం వ్యక్తం చేశారు. పెడన నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ బలోపేతానికి ఆయన ఎంతో కృషి చేశారని కొనియాడారు.

2014లో కైకలూరు నుంచి పోటీ



ఉప్పాల రాంప్రసాద్ (ఫైల్)

రామ్‌ప్రసాద్ 2014 అసెంబ్లీ ఎన్నికల్లో కైకలూరు నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా సమీప ప్రత్యర్థి కామినేని శ్రీనివాస్‌పై పోటీ చేశారు. పెడన నియోజకవర్గానికి చెందిన ఆయన కొన్ని అనివార్యకారణాల వల్ల కైకలూరు నుంచి పోటీ చేయాల్సి వచ్చింది. అప్పటి ఎన్నికల్లో ఓటమి చెందినప్పటికీ ఉప్పాలకు 66,521 ఓట్లతో ప్రజలు ఆశీర్వదించారు. మహానేత వైఎస్సార్, ఆయన కుమారుడు సీఎం జగన్ మోహన్‌రెడ్డితో ఉప్పాలకు చక్కటి పరిచయాలు ఉన్నాయి. కైకలూరు నియోజకవర్గం నుంచి ఎవరు వెళ్లినా ఆప్యాయంగా పలకరిస్తారని ఉప్పాలకు మంచి పేరుంది. పలువురు బీసీ సంఘ నాయకులు ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేశారు.

వెద సాగుపై రైతుల ఆసక్తి



వెదసాగు చేస్తున్న రైతులు

మొవ్వ: వాతావరణ పరిస్థితులు, నానాటికి పెరుగుతున్న కూలీ రేట్ల దృష్ట్యా మండలంలో పలు గ్రామాల రైతులు వరిసాగులో వెద పద్ధతికి మొగ్గు చూపుతున్నారు. మృగశిర కార్తె ప్రవేశించి దారిదాపు పదిరోజులు అవుతున్నా చినుకులు పడే పరిస్థితులు కాన రాకపోవటం, వాతావరణంలో ఉష్ణోగ్రతలు అధికంగా ఉండటంతో పాటు వేడి గాలులు వీయటంతో ఆకుమడులు వేసేందుకు రైతులు సందిగ్ధావస్థలో ఉన్నారు. దీనికి ప్రత్యమ్నాయంగా తరుణం మించిపోకుండా ఉండేందుకు వెదపద్ధతివైపు మొగ్గు చూపుతున్నారు. ఎకరాకు రూ.2 వేల నుంచి రూ.2.5 వేలు వెచ్చిస్తూ వెద సాగు సిద్ధం చేస్తున్నారు. వేసవి దుక్కల అనంతరం రోటోవీటర్లుతో నేలను దున్ని విత్తనాలను వేస్తున్నారు. ఎకరాకు 15 కిలోల నుంచి 23 కిలోల లోపు విత్తనాలను వెద సాగుకి వినియోగిస్తున్నారు. మండలంలో అధికంగా 150 రోజుల పంటలైన ఎంటీయూ1061, ఎంటీయూ 38 రకాలను సాగు చేస్తున్నారు.

పెరుగన్నం, మజ్జిగ పంపిణీ



ఆర్టీసీ బస్సులో ప్రయాణికులకు పెరుగన్నం పంపిణీ చేస్తున్న నిర్వాహకులు



మజ్జిగ పంపిణీ చేస్తున్న మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు

కైకలూరు: స్థానిక సాయిబాబా ధ్యానమందిర సేవా ట్రస్టు ఆధ్వర్యంలో గాంధీబొమ్మ సెంటర్ వద్ద 800 మందికి పెరుగన్నం, మజ్జిగను ఆదివారం పంపిణీ చేశారు. ట్రస్టు అధ్యక్షుడు కొనిజేటి శ్రీనివాసరావు మాట్లాడుతూ అమావాస్య సందర్భంగా శివునికి అన్నాభిషేకం నిర్వహించి పెరుగన్నం పంపిణీ చేశామన్నారు. ఆర్టీసీ బస్సులలో ప్రయాణికులకు సైతం పెరుగన్నం అందించామన్నారు. కార్యక్రమంలో సేవా ట్రస్టు డైరెక్టర్ అడ్డగర్ల రాణి, ఆర్గనైజింగ్ సెక్రటరీ వరదా బాబు, సెక్రటరీ శీతల శోభన్‌బాబు, సాయి భక్తులు పాల్గొన్నారు.

కూచిపూడి(మొవ్వ): మండలంలోని కూచిపూడి బస్టాండ్‌లో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కూచిపూడి బస్టాండ్‌లో దాతల సహకారంతో సాగుతున్న చలివేంద్రం నిర్వహన ఆదివారం నాటికి 35వ రోజుకు చేరుకుంది. మొవ్వ మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ చీకటిమర్ల శివరామ ప్రసాద్ తన భార్య అంజనావతి జ్ఞాపకార్థం 220 లీటర్ల మజ్జిగను, మినరల్ వాటర్‌ని ప్రమాణికులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ పుట్టి శ్రీనివాసరావు, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

సంతకం ఫోర్జరీ చేశారని ఫిర్యాదు

పెనమలూరు: సంతకం ఫోర్జరీ చేసి తన భర్తతో పాటు పలువురు వ్యక్తుల సొమ్ము స్వాహా చేశారని ఫిర్యాదు అందటంతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. సీఐ ఎం.కిషోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం... పోరంకి రామాపురం కాలనీకి చెందిన హనీరాణి ఉపాధ్యాయినిగా పని చేస్తోంది. ఆమె భర్త టి.ప్రసాద్ ఛత్తీస్‌గడ్‌లో పని చేస్తాడు. భర్త భార్య మధ్య కుటుంబ తగాదాలు ఉన్నాయి. కాగా తన భర్త తన సంతకం ఫోర్జరీ చేసి ఎల్ఐసీ హౌసింగ్ లోన్ 2011 సంవత్సరం నుంచి పలు దఫాలుగా రూ.52.70 లక్షలు తీసుకున్నాడు. ఇందులో రూ.26.40 లక్షలతో ఇల్లు కొన్నాడని, మిగతా సొమ్ము రూ.26.30 లక్షలు ఇంటికి గాని, కుటుంబానికి కాని ఖర్చు చేయలేదని తెలిపింది. తన భర్త దుర్బుద్ధితో ఫోర్జరీ చేసి మోసం చేశాడని ఫిర్యాదులో పేర్కొంది. తన భర్త చేసిన మోసంలో ఎల్ఐసీ అసిస్టెంట్ మేనేజర్ శ్రీకాంత్, ఏజెంట్ విజయ్, సాక్షిగా ఉన్న హఫీజ్, ఫీల్డ్ ఆఫీసర్ పాత్ర ఉందని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటన పై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

షాపుల వేలం వాయిదా

గుడివాడరూరల్: పట్టణంలోని పురపాలక సంఘానికి చెందిన 11 షాపులకు నెలవారీ అద్దెపై లీజుకు ఇచ్చేందుకు ముందుగా ఈనెల 19వ తేదిన వేలం వేసేందుకు నిర్ణయించారు. అయితే అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్లు మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ తెలిపారు. తిరిగి షాపులకు వేలం నిర్వహించే తేదీ, సమయం త్వరలో తెలియజేస్తామని ఆయన వివరించారు.

ఉపాధి పనుల పరిశీలన



పామర్రు: మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో 5208 మంది ఉపాధి కూలీలతో పనులు నిర్వహించామని ఏపీవో పొలు రాజు తెలిపారు. మండల పరిధిలోని పెదమద్దాలిలో జరుగుతున్న ఉపాది ఫనులను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంట బోదెలలో పూడిక తీత పనులు ప్రస్తుతం జరుగుతున్నాయని తెలిపారు. ఈనేపథ్యంలో పంట బోదె తవ్వకం పనులు నాణ్యంగా ప్రమాణాలతో కచ్చితమైన కొలతలతో నిర్వహించాలని సూచించారు. కూలీల మస్టర్లలో ఏవిధమైన అవక తవకలు లేకుండా కచ్చితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డు అసిస్టెంట్లు, మేట్లు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

స్వామివారికి వెండి వస్తువుల సమర్పణ



మోపిదేవి: మోపిదేవి వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి విజయవాడ గుణదల వాస్తవ్యులు డాక్టర్ పీపీ లలిత్ కుమార్ దంపతులు ఆదివారం 580 గ్రాముల విలువగల వెండి వస్తువులు సమర్పించారు. ఉదయం ఆలయానికి చేరుకున్న దాతలు స్వామివారికి కానుకగా వెండి పళ్లెం, మూడు వెండి గిన్నెలను ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణకు అందచేశారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించారు.

12 మంది జూదరుల అరెస్టు



పోలీసు స్టేషన్‌లో పట్టుబడిన పేకాట జూదరులతో సీఐ, ఎస్‌ఐలు

కైకలూరు: పేకాట, కోడిపందేలు వంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కైకలూరు పట్టణ సీఐ ఆకుల రఘు హెచ్చరించారు. ఆదివారం పోలీసుస్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ కైకలూరు మంచినీటి చెరువు, కరకట్ట ప్రాంతం, వింజరం గ్రామాల్లో పేకాట శిబిరాలపై దాడులు చేసి మొత్తం 12 మంది జూదరులను అరెస్టు చేశామన్నారు. వీరి నుంచి రూ.9,820 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. గ్రామాల్లో కోడిపందేలు, జూదాలపై పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కైకలూరు టౌన్ ఎస్ఐ జ్యోతిబసు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రేపు విద్యార్థులకు అవగాహన సదస్సు

గుడివాడరూరల్: స్థానిక అక్కినేని నాగేశ్వరరావు కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి డిగ్రీ సింగిల్ మేజర్ కోర్సులపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీజేఎస్ కుమార్ ఆదివారం తెలిపారు. స్థానిక ఏఎన్ఆర్ కళాశాలలో ఈనెల 20న ఉదయం 10 గంటలకు డాక్టర్ సీవీ రామ్మోహనరావు సెమీనార్ హాల్‌లో విద్యార్థులకు నిర్వహించే ఈ సదస్సులో పాల్గొనాలన్నారు. తమ భవిష్యత్ అవసరాలకు అనువైన విద్యా కోర్సులపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు స్వాగత ద్వారం ప్రారంభం

ముదినేపల్లి రూరల్: రెండోపూరిగా ప్రసిద్ధి చెందిన మండలంలోని వడాలి శ్రీజగన్నాథస్వామి ఆలయ నూతన స్వాగతద్వారం ఈనెల 20న ప్రారంభిస్తామని ఆలయ ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. ఆలయ చైర్మన్ మత్రివాడ సుబ్బలక్ష్మి, వీరారెడ్డి దంపతులు సొంత నిధులతో ఈ ద్వారాన్ని నిర్మించినట్లు ఈవో తెలిపారు. ఈ సందర్భంగా ప్రారంభం రోజున స్వామి వారి రథయాత్ర గ్రామంలో నిర్వహిస్తామన్నారు. స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు దీనిని ప్రారంభిస్తారన్నారు.